

తాత్కాలికంగా సమ్మె వాయిదా
రిలే నిరాహార దీక్షలు కొనసాగింపు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ స్విమ్స్ కాంట్రాక్టు కార్మికులు రోజుకు గంటపాటు వినూత్నంగా నిరసనలు తెలపాలని నిర్ణయించడంతో, యాజమాన్యం వారిపై 'ఎస్మా' ప్రయోగించింది. దీంతో కడుపు మండిన కాంట్రాక్టు కార్మికులు గురువారం ఉదయం 'సమ్మెకు సై' అన్నారు. యాజమాన్యం చేసిన తప్పిదాన్ని సరిజేసేంత వరకు, రాతపూర్వక హామీ నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదని ప్రకటించారు. మధ్యాహ్నం స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ చర్చలకు పిలిపించారు. డైరెక్టర్, ఆర్ఎంవో రామ్మోహన్, ఎఎస్ఓ మనోహర్ ఆచారి సమక్షంలో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4.30 వరకు చర్చలు జరిగాయి. స్విమ్స్ డైరెక్టర్ అభ్యర్థన మేరకు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేయాలని, యథావిధిగా రిలే నిరాహారదీక్ష కొనసాగించాలని స్విమ్స్ కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు తీర్మానించినట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి చెప్పారు. ఎస్వీవీ, ఆర్వీవోలు స్పందిస్తూ సమ్మె చట్టబద్ధమైనదేనని, వారి డిమాండ్లు న్యాయమైనవేనని, పరిష్కరించాల్సిన బాధ్యత తమదేనని, వెంటనే ఈ సమస్యను టిటిడి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కిలోకు రూ.8 ఇవ్వాల్సిందే..!

- పల్ప్ పరిశ్రమలకు సిఎం ఆదేశం
- ఆర్డర్లు లేవని..ఆదుకోవాలని రైతుల వినతి
- జిఎస్టి తగ్గించాలన్న 'పల్ప్' యాజమాన్యం
- 'మధ్యాహ్న భోజనం' అంశం పరిశీలనలో...
- అంతర్జాతీయ ప్రమాణాలతో పండించాలి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, శాంతిపురం

డిమాండ్‌కు తగిన పంటలనే రైతులు పండించాలని, మామిడి రైతులు, పల్ప్ పరిశ్రమ యాజమాన్యం కలిసి పనిచేయాలని సిఎం హితబోధ చేశారు. గురువారం కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కడపల్లిలోని తన నివాసంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతులు, పల్ప్ పరిశ్రమ ప్రతినిధులు, ప్రాసెసింగ్ యూనిట్లతో సిఎం సమావేశం అయ్యారు. రైతుల నుంచి తక్షణం మామిడి కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని ప్రాసెసింగ్, పల్ప్ పరిశ్రమలను సిఎం ఆదేశించారు. అదే సమయంలో పల్ప్ పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. మామిడి రైతులకు భవిష్యత్‌లోనూ ఎటువంటి సమస్యా లేకుండా ప్రభుత్వం వైపు నుంచి కార్యాచరణ చేపడతామని సిఎం హామీ ఇచ్చారు. మరోవైపు ఆర్డర్లు లేవని, నిల్వ చేసుకోవడానికి స్థలం లేదని పల్ప్ పరిశ్రమలు మామిడిని కొనుగోలు చేయటం లేదని రైతులు సీఎం దష్టికి తీసుకువచ్చారు. కొన్ని చోట్ల అన్‌లోడింగ్ కోసమే 3-4 రోజుల సమయం పడుతోందని విన్నవించారు. దీనిపై స్పందించిన సీఎం తక్షణం ఉత్పత్తిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రాసెసింగ్ యూనిట్లు, పల్ప్ పరిశ్రల ప్రతినిధులకు సూచించారు. మరోవైపు పాకిస్తాన్, ఆఫ్రికన్ దేశాల్లో దిగుమతి సుంకాలు లేవని, యూరోపియన్ దేశాల్లో దిగుమతి సుంకాలు ఎక్కువగా ఉన్నాయని మ్యాంగో పల్ప్ పరిశ్రమలు, ఎగుమతిదారులు సీఎం కు తెలియచేశారు. సుంకాలు తగ్గించేలా ఆయా దేశాలను ఒప్పించేందుకు కేంద్రంతో మాట్లాడాలని కోరారు. అలాగే మ్యాంగో పల్ప్ పై విధిస్తున్న జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించేలా మాట్లాడాలని సీఎంకు విన్నవించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి జీఎస్టీ తగ్గింపు పై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశామని.. మరోమారు దీనిపై మాట్లాడతానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎకరాకు 6-12 టన్నుల మేర మామిడి ఉత్పత్తి వచ్చిందని రైతులకు మంచి ధర రావాలని అలాగే ప్రాసెసింగ్ యూనిట్లు, పల్ప్ పరిశ్రమకు వయబిలిటీ రావాల్సి ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు మూడు రోజుల పాటు మ్యాంగో జ్యూస్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని పరిశ్రమల ప్రతినిధులు ముఖ్యమంత్రి దష్టికి తీసుకువచ్చారు. అయితే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషకాహారంగా గుడ్డును అందిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ అంశంపై అధ్యయనం చేసి తదుపరి ఆలోచన చేస్తామని స్పష్టం చేశారు. మామిడి పంటలో ఎరువులు, పురుగుమందులు వాడకుండా అత్యుత్తమ విధానాలను అనుసరించి, అంతర్జాతీయ ప్రమాణాలతో మామిడి పండించాలని సూచించారు. వెయిటింగ్ లేకుండా మామిడి రైతులకు రూ.8 ధర చెల్లించి కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.

చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఈ సమావేశంలో 33 మంది మామిడి ప్రాసెసింగ్ యూనిట్ల, రైతుల ప్రతినిధులు పాల్గొన్నారని చిత్తూరు జిల్లాలో 30 మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు పనిచేస్తున్నాయని, వారి కంబైన్డ్ కెపాసిటీ ఏడువేల మెట్రిక్ టన్నులు కాగా, 6,500 మెట్రిక్ టన్నులు సేకరించడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకూ 1.12 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలు చేశారని, ఇంకా 1.70 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ఉత్పత్తి రావాల్సి ఉందని సీఎంకు వివరించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్, చిత్తూరు ఎం పి డా. దగ్గుమళ్ల ప్రసాద్, రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి, జెసి జి. విద్యాధరి, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్, హార్టికల్చర్ డీడీ మధుసూదన్ రెడ్డి, మామిడి రైతులు పాల్గొన్నారు.

9న బంగారుపాళ్యంలో జగన్ పర్యటన

ప్రజాశక్తి - యాదమరి, తిరుపతి సిటి

గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న మామిడి రైతులకు అండగా ఉంటానంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 9న చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో పర్యటించనున్నారురర. గురువారం బంగారుపాళ్యంలో హెలిప్యాడ్ స్థలాన్ని, పర్యటన ఏర్పాట్లను మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఆర్‌కె రోజా, నారాయణస్వామి, మాజీ ఎంపి రెడ్డెప్ప, చిత్తూరు జిల్లా పరిషత్ వైస్‌ఛైర్మన్ బి.ధనంజయరెడ్డి పర్యవేక్షించారు. జగన్మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. తిరుపతిలోని పెద్దిరెడ్డి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

బంగారుపాళ్యంలో ఏర్పాట్లు పరిశీలన

ఎదిరిస్తే .... 'ఎస్మా'నా..!

రాతపూర్వక హామీ బేఖాతర్	కాంట్రాక్టు కార్మికులు 'సమ్మెకు..సై'
చర్చలతో తాత్కాలిక వాయిదా	కొనసాగనున్న రిలేనిరాహారదీక్ష

గురువారం ఉదయం సమ్మెలో భాగంగా..

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తమను పర్మినెంట్ చేయాలి, రెండు మూడు రెట్లు వేతనాలు ఉన్న ఫలంగా పెంచాలి, పనిగంటలు తగ్గించాలి, మౌళిక వసతులు కల్పించాలి, సమానపనికి సమానవేతనం ఇవ్వాలి, కనీస వేతనాన్ని అమలు చేయాలి అంటూ కార్మికులు పోరాటాలు చేయడం చూస్తాం. చూస్తుంటాం..! కానీ స్విమ్స్‌లో కార్మికులు అవేవి కోరలేదు. కేవలం అధికారులు చేసిన తప్పిదాన్ని సరిచేసుకోవాలి, తమ హోదా పేరులో చిన్న మార్పు చేయాలని మాత్రమే కోరారు. లేబర్ కోర్టు, లేబర్ అధికారులు సైతం దాన్ని సరిచేయాలని సూచించారు. స్విమ్స్, టిటిడి అధికారులు సైతం తమ తప్పిదాన్ని అంగీకరించారు. కానీ దాన్ని సరిదిద్దుకునేందుకు మాత్రం ఇగో అడ్డొచ్చింది.. కార్మికులు తమకు న్యాయం చేయాలని కోరినందుకు టిటిడి, స్విమ్స్ యాజమాన్యం కార్మికులపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతోంది. ఇదేమి అన్యాయం అని ప్రశ్నిస్తే 'ఎస్మా' బూచి చూపి, బెదిరింపులకు పూనుకోవడం శోచనీయం. విధిలేని పరిస్థితుల్లో యాజమాన్యం తీరుకు నిరసనగా కార్మికులు సమ్మెకు సై అనాల్సి రావడం గమనార్హం.

శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్). రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అతిపెద్ద ఆసుపత్రి. దేశంలోనే మహిళల కోసం ప్రత్యేకంగా వైద్య కళాశాల ఉన్న అనుబంధ ఆసుపత్రి. టిటిడి ఆధ్వర్యంలోని ఏకైక వైద్య విశ్వవిద్యాలయం. నిత్యం మూడు వేల మందికిపైగా ఓపి సేవలు, 350 నుంచి 500 వరకు అడ్మిషన్లు, 1050 పడకల సామర్థ్యం గల పెద్ద ఆసుపత్రి స్విమ్స్. పేరులో ఘనపాటే. కానీ కార్మికుల సమస్యలు విస్మరించడంలో పరిపాటి.

రెండు సంవత్సరాల క్రితం వరకు రాస్ సంస్థ ద్వారా స్విమ్స్‌లో పని చేస్తున్న వార్డు బాయ్స్‌ను టిటిడి విలీనం సందర్భంగా ఎస్ఎల్ఎస్ఎంపిసి (శ్రీలక్ష్మీశ్రీనివాస మాన్ పవర్ కార్పొరేషన్)కు మార్పు చేశారు. ఈ సందర్భంగా వార్డు బాయ్స్‌గా ఉన్న వారిని శానిటరీ వర్కర్స్‌గా పేరు మార్చి సంబంధిత ఫైల్‌ను స్విమ్స్ అధికారులు టిటిడికి పంపారు. శానిటరీ వర్కర్స్ పేరు మార్పుతో రెండేళ్లగా వీరికి ఎలాంటి వేతనాలు పెరగడం లేదు. వీరితో పాటే పని చేస్తున్న సెక్యూరిటీకి సైతం ప్రస్తుతం నెలకు 21 నుంచి 23 వేల వేతనం వస్తోంది. వీరికి మాత్రం ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నెలకు కేవలం 13వేల రూపాయలు కూడా సక్రమంగా రావడం లేదు. ఇదేమని అధికారులను అడిగితే శానిటరీ వర్కర్స్ పేరు మార్పు విషయం వెలుగులోకి వచ్చింది. ఇది అధికారుల తప్పిదమే అని స్విమ్స్ సైతం అంగీకరించింది. అప్పటి నుంచి అనేక సార్లు స్విమ్స్ డైరెక్టర్లు, టిటిడి యాజమాన్యంకు వినతులు ఇచ్చినా, ధర్నాలు చేసినా, నిరసనలు తెలిపినా పట్టించుకోలేదు. విధిలేని పరిస్థితుల్లో స్విమ్స్ కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆందోళనకు కార్మికులు సిద్ధమయ్యారు. సమ్మె బాట పట్టిన కార్మికుల ఆవేదన వారి మాటల్లోనే....

మాది న్యాయమైన పోరాటం : వి.దేవి

ఓపికతో వ్యవహరిస్తున్న కార్మికుల సహనానికి యాజమాన్యం పరీక్ష పెడుతోంది. సమస్యల పరిష్కారానికి శతవిధాల మా వంతు ప్రయత్నం చేశాం. యాజమాన్యం సహకరించలేదు. అనివార్యమై పోరాటానికి సిద్ధమయ్యాం. రోగులు, వైద్యులు, సిబ్బంది మా విన్నపాలను అర్థంచేసుకుని న్యాయమైన మా పోరాటానికి సహకరించండి.

ఆదుకోమన్నందుకు అగచాటు: కె.అరుణ

సంవత్సరాల తరబడి పని చేస్తున్న మాకు అన్యాయం జరుగుతోంది. ఆదుకోమని స్విమ్స్ యాజమాన్యాన్ని అడిగినందుకు మమ్మల్ని అగచాట్లు పాలు చేస్తున్నారు. ఆందోళనలు చేస్తున్నా కనీస స్పందన లేదు. ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలి.

కార్మికులపై కనికరం లేదు : టి.లలిత

రాత్రింబవళ్లు గొడ్డు చాకరీ చేస్తున్న కార్మికులంటే స్విమ్స్ అధికారులకు కనీసం కనికరం కూడా లేదు. బట్టలు మార్చుకునేందుకు కనీసం గది కూడా లేదు. కార్మికుల పట్ల తీవ్ర వివక్షను ప్రదర్శిస్తున్నారు. న్యాయమైన సమస్యను పరిష్కరించాలి.

సమ్మెకు..సై అనక తప్పలేదు
రవి, యూనియన్ అధ్యక్షులు

రెండు సంవత్సరాలుగా మా సమస్యపై పోరాటం చేస్తున్నాం. ఏడాది కిందట స్వయంగా డైరెక్టర్ సమక్షంలో చర్చలు జరిపి, రాతపూర్వంగా ఒప్పందాలు చేసుకున్నాం. అవి అమలు కాలేదు. డిసిఎల్ ముందు జరిగిన చర్చల్లో సైతం స్విమ్స్ అధికారులు తప్పిదం జరిగిందని అంగీకరించారు. సమయం ఇస్తే పరిష్కరిస్తామన్నారు. పట్టించుకోకపోగా ఉద్యోగాలు ఊడపెరుకుతాం అంటూ బెదిరిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో కార్మికులు సమ్మెకు సై అనాల్సి వచ్చింది. మరోసారి అధికారుల మాటలు నమ్మి సమ్మెను వాయిదా వేశాం.. రిలేదీక్షలు కొనసాగిస్తున్నాం. సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు.

నకిలీ వెబ్‌సైట్లతో మోసపోతున్న భక్తులు

ప్రజాశక్తి - తిరుమల

నకిలీ వెబ్‌సైట్లలో తిరుమల శ్రీవారి టికెట్ల పేరుతో జరుగుతున్న మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. శ్రీవారి దర్శనం టికెట్ల పేరుతో భక్తులను నిలువునా దోచుకుంటున్నారు మోసగాళ్లు. మరో నకిలీ టికెట్ల మోసం వెలుగులోకి వచ్చింది. శ్రీవారి తోమాల టికెట్ల పేరుతో జరిగిన ఘరానా మోసం బయటపడింది. శ్రీవారి తోమాల టికెట్ల పేరుతో ఓ కుటుంబం నుంచి రూ. 65 వేలు రాబట్టాడు దళారీ. కుటుంబం నుంచి డబ్బులు వసూలు చేసిన మోసగాడు నకిలీ టికెట్లు అంటగట్టాడు. దళారీ చేతిలో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి...తోమాల సేవ, అభిషేక సేవలు తనివి తీరా చూడాలని భావించిన కుటుంబం దళారీ మోసానికి బలయ్యింది.. టికెట్ల కోసం ముందుగా దళారీకి డబ్బులు చెల్లించి తీరా కొండకు చేరుకున్న తర్వాత తాము నకిలి టికెట్లు కొని మోసపోయామని గ్రహించారు బాధితులు. పది రోజుల ముందే ఒక వ్యక్తి మొబైల్ నుండి వచ్చిన తోమాల, అభిషేక సేవా టికెట్లను తమ ఫోన్ ద్వారా డౌన్లోడ్ చేసుకునే క్రమంలో అవి నకిలీవి అని తేలడంతో విస్తు పోయారు బాధితులు.వెంటనే తిరుమల వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా... ఎక్కడైతే మొబైల్ ట్రాన్సాక్షన్ చేశారో ఆ పరిధి పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇవ్వాలని చెప్పారు పోలీసులు. తెలంగాణలోని సిరిసిల్లకు చెందిన విజయ్ అనే ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి తన మిత్రుడి ద్వారా బాలాజీ అనే దళారీ నంబరు పొందాడు. బాలాజి కోరిన దర్శనం చేయిస్తాడని చెప్పడంతో అతనిని సంప్రదించి పలు దఫాలుగా రూ. 65వేలు పంపాడు. అందుకు పది రోజుల క్రితం విజయ్ కుటుంబ సభ్యులు ఐదు మంది పేర్లతో టీటీడీ లోగో కలిగిన నకిలీ తోమాల సేవ టికెట్లను నెట్ లో తయారు చేసి.. విజయ్ మొబైల్ కి పంపాడు బాలాజీ. స్వామివారి తోమాల సేవలో పాల్గొనేందుకు బుధవారం కుటుంబంతో కలిసి తిరుమలకు చేరుకున్నారు. ఎందుకైనా మంచిదే అని తిరుపతిలో ఉచిత టైమ్ స్లాట్ టోకెన్లు కూడా తీసుకున్నారు బాధితులు. దర్శనానికి వెళ్లే ముందు బాలాజీకి ఫోన్ చేయగా అతను లిఫ్ట్ చేయకపోగా మెసేజ్ లకు కూడా స్పందించలేదు. దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. రెఫరెన్స్ లేకుండా దర్శనం టికెట్ మంజూరు కాదని.. ఎంతటి వీఐపీ అయినా ప్రోటోకాల్ పరిధిలో ఉన్నవారు స్వయంగా వస్తేనే తోమాల లేదా ఇద్దరికి మాత్రమే టికెట్లు మంజూరు చేస్తారని తెలిపారు సిబ్బంది. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు చేసేదేమీ లేక స్వామివారి ఉచిత దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణం అయ్యారు.

దళారులు శ్రీవారి భక్తులను మోసం చేసేందుకు రక రకాల కొత్త మార్గాలను ఉపయోగించి దోచేస్తున్నారని... ఇటువంటి మోసాలపై ఇటు టీటీడీ, అటు పోలీసులు బయట వ్యక్తులను నమ్మకండి... టీటీడీ అధికారిక వెబ్సైట్ ద్వారానే దర్శనం టికెట్లను బుక్ చేసుకోవాలని పదే పదే కోరుతున్నప్పటికీ తరచూ ఇలాంటి ఘటనలతో భక్తులు మోసపోతూనే ఉన్నారు. నకిలీ టికెట్లతో భక్తులను మోసం చేసిన బాలాజీ బ్యాంక్ అకౌంట్ కడప జిల్లా ఒంటిమిట్టలో ఉన్నట్లు తెలిపాడు బాధితుడు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి - రేణిగుంట

అల్లూరి జయంతి పురస్కరించుకుని తిరుపతిలోని వివిధ హైస్కూళ్లల్లో వేమన విజ్ఞాన కేంద్రం, జెవివి ఆధ్వర్యంలో గురువారం ప్రతిభాపరీక్ష నిర్వహించారు. అల్లూరి జీవితం, స్వాతంత్ర్యోద్యమంలో వారి పాత్ర, మన్యం పోరాట గాథలు తదితర అంశాలపై ప్రశ్నాపత్రాన్ని రూపొందించి విద్యార్థుల్లో అల్లూరి పోరాట స్ఫూర్తిని నింపే ప్రయత్నం చేసినట్లు వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు పంచముఖేశ్వరరావు, నెల్లూరు మునిలక్ష్మి, నడ్డినారాయణ, బాలాజీ చౌదరి, మల్లారపు నాగార్జున, ఒ.ప్రమోద్, ఒ.వెంకటరమణ, కుప్పస్వామి పేర్కొన్నారు. భారతీయ విద్యాభవన్, పూలే గురుకుల పాఠశాల, ఎస్‌జిఎస్ హైస్కూల్, ఓరియంటేషన్, రేణిగుంటలోని ట్రైబల్ వెల్ఫేర్, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగిందని పేర్కొన్నారు.

అమరాలో శస్త్ర చికిత్స విజయవంతం

రేణిగుంట : అమరా ఆస్పత్రిలో 70 ఏళ్ల వయస్సున్న నంద్యాల జిల్లా చగలమర్రి గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్యకు అబ్డోమినల్ ఆఓర్టిక్ అన్యూరిజమ్ (బృహద్ధమని వాపు) చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఆయన పొట్ట భాగంలో అస్పష్టమైన నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండడంతో ఆస్పత్రిలో సంప్రదించారు. తక్షణమే చికిత్స చేయకపోతే పగిలిపోయే ప్రమాదం ఉండేది. ఈ శస్త్ర చికిత్సను డాక్టర్ కె.వెంకట శివకృష్ణ, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, డాక్టర్ వెంకటేష్ గురజాల, డాక్టర్ ఎం.నాగరాజు, డాక్టర్ సయ్యద్ మహ్మద్ నౌషాద్ విజయవంతంగా నిర్వహించినట్లు సిఐ ఒ.భాగ్యలక్ష్మి తెలిపారు.

ఉప్మాలో 'జెర్రి'

ముగ్గురు విద్యార్థినులకు అస్వస్థత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

బీసీ బాలుర హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ ఘటన మరవకముందే శ్రీకాళహస్తిలో మరో ఘటన చోటు చేసుకుంది. ఉదయం అల్పాహారంలో జెర్రి పడిన ఉప్మా తిని ముగ్గురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన గురువారం బీసీ మహిళా హాస్టల్ లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బీసీ మహిళా వసతి గహంలో సుమారు 65 మంది ఇంటర్, డిగ్రీ, పీజీ చదివే మహిళా విద్యార్థినులు ఉన్నారు. గురువారం అల్పాహారంలో భాగంగా వీరికి ఉప్మా వడ్డించారు. అయితే ఇంటర్ చదువుతున్న ముగ్గురు విద్యార్థినుల్లో ఒకరికి జెర్రీ తో కూడిన ఉప్మా వచ్చింది. దీంతో విద్యార్థినిలు ఒక్కసారిగా కేకలు వేయడంతో తోటి విద్యార్థులు కూడా విషయం తెలుసుకొని ఉప్మాను పారబోశారు. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ ఆహారం అందించకపోవడంతో అర్థాకలితో వెళ్లిన ఇంటర్ విద్యార్థినిలు ప్రార్థన సమయంలో అస్వస్థతకు గురై కింద పడిపోయారు. దీంతో వారిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం వారి పరిస్థితి బాగానే ఉంది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి విద్యార్థినులను పరామర్శించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. గోరుముద్ద పాయే.. జెర్రి ముద్ద వచ్చే అంటూ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే హాస్టల్లో ఫుడ్ పాయిజన్ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య విద్యార్థినులను పరామర్శించారు. కూటమి ప్రభుత్వం మెనూను మార్చింది కానీ, అధికారుల తీరును కాదని విమర్శించారు. సంక్షేమ హాస్టల్లు, ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనాన్ని రోజుకో అధికారి తనిఖీ చేయాల్సి ఉన్నా, ఆ దిశగా ఎవరూ అడుగులు వేయడం లేదని మండిపడ్డారు

ప్రజాశక్తి ప్రచురించిన సార్వత్రిక సమ్మె ప్రత్యేక స్పెషల్ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నేతలు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

లేబర్‌కోడ్‌ల రద్దుకై దేశవ్యాప్తంగా జులై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల సదస్సు పిలుపునిచ్చింది. వేమన విజ్ఞాన కేంద్రంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు గురువారం జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్. చంద్రశేఖర్ రెడ్డి, ఐఎఫ్టియు జిల్లా నాయకులు పి. వెంకటరత్నం మాట్లాడుతూ ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం అత్యంత దారుణంగా కార్మికుల హక్కులను హరించి వేస్తోందన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మారుస్తూ, అత్యంత ప్రధానమైన 29 కార్మిక చట్టాలను, హక్కులను యాజమాన్యాలకు అనుగుణంగా మారుస్తోందన్నారు. ఇఎస్ఐ, ఇపిఎఫ్, గ్రాట్యూటీ సౌకర్యాలన్నింటినీ యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా మార్పులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో లేబర్‌కోడ్‌లు అమల్లోకి వస్తే మరింత ఉల్లంఘనకు పాల్పడే అవకాశం ఉందన్నారు. నేతలు టి.సుబ్రమణ్యం, ఎన్.మాధవ్, కెవైరాజా, లోకేష్, మురళీధర్, బుజ్జి, చిన్న, మునిరాజ, గోవిందస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి' తీసుకొచ్చిన 'సార్వత్రిక సమ్మె' ప్రత్యేక సంచికను నేతలు ఆవిష్కరించారు.

కార్మిక సంఘాల సదస్సు పిలుపు

- రేణిగుంటలో సిఐటియు విస్తృతస్థాయి సమావేశం సెల్వరాజ్ అధ్యక్షతన జరిగింది. కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, కార్మికవర్గానికి నష్టం చేసే లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ధనమ్మ, అంబిక, రాజశేఖర్, రవి, సుబ్రమణ్యం, దస్తగిరి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

సేవారంగం బలోపేతంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సేవారంగం బలోపేతంతోనే తిరుపతి సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. తిరుపతి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కమిటీ సమావేశం గురువారం ఉదయం ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. వికసిత భారత్ 2047 నాటికి నియోజకవర్గం ఏ విధంగా ఏఏ రంగాల్లో అభివృద్ధి జరుగుతుందనే అంచనాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వార్డు కార్యదర్శులు వివరించారు. 2029 నాటికి 10 మార్గదర్శకాల అమలుతో తిరుపతి అభివృద్ధిలో కీలక మైలురాయిని చేరుకోవడం సాధ్యమని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. జీరో పావర్టీ సాధించడం కోసం పి4 అమలు చేస్తామన్నారు. మార్గదర్శకులకు తోడు బంగారు కుటుంబీకులను సమావేశానికి ఆహ్వానించారు. తిరుపతి నియోజకవర్గంలో ఏడువేల మంది బంగారు కుటుంబాలను గుర్తించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ టూరిజం అభివృద్ధితో నియోజకవర్గం అభివృద్ధి ముడిపడి ఉందన్నారు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తిరుపతిని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. విజయవాడ, విశాఖపట్నంకు ధీటుగా తిరుపతిని అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే నూతన రైల్వేస్టేషన్ అందుబాటులోకి రానుందని, ఇంటిగ్రేటెడ్ బస్టాండ్ నిర్మాణ పనులకు టెండర్లను పిలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనలో అలసత్వం వద్దు : కమిషనర్

తిరుపతి టౌన్ : ప్రజలకు సౌకర్యాల కల్పనలో అలసత్వం వద్దని, త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. గురువారం రెండో వార్డులోని రాజీవ్‌గాంధీ కాలనీ, గొల్లవానిగుంట, లీలామహల్ సమీపంలోని మధురానగర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలను పరిశీలించారు. భూగర్భడ్రైనేజీ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, తిరిగి రాకుండా మరమ్మతులు చేయాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసికుమార్ పాల్గొన్నారు.

మా బడి మాకు కావాలి

ప్రజాశక్తి - ఓజిలి

మా బడి మాకు కావాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఆర్.లక్ష్మి, శివకవి ముకుంద మాట్లాడుతూ. మండల కేంద్రంలోని నల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి గిరిజన కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలను మరొక చోటకు మార్చడం వలన గిరిజన పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న పాఠశాలకు వెళ్లి విద్యార్థులు అలసిపోతున్నారు. దీంతో పిల్లలకు ఆరోగ్య సమస్యలు తల ఎత్తుతున్నాయని తెలిపారు. పాఠశాలలు విలీనం పేరుతో ఉన్న పాఠశాలలు తొలగించి దూర ప్రాంతాలకు మార్చడం సరికాదని పేర్కొన్నారు. తమ పాఠశాల తమకు కావాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిడ్ డే మీల్స్ జిల్లా కార్యదర్శి విజయమ్మ , విమలమ్మ , జయమ్మ , గిరిజనులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో ఆర్‌సి మునికృష్ణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

హర్యానాలోని గురుగ్రామ్‌లో రెండు రోజుల పాటు జరుగుతున్న జాతీయ సదస్సుకు తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ హాజరయ్యారు. 'దేశ నిర్మాణంలో పట్టణ, స్థానిక సంస్థ పాత్ర, రాజ్యాంగ ప్రజాస్వామ్యం' అంశంపై గురువారం సదస్సు జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, హర్యానా ముఖ్యమంత్రి నయంసింగ్‌లను ఆర్‌సి మునికృష్ణ సత్కరించారు. శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. టిడిపి సీనియర్ నాయకులు పాఠకం వెంకటేష్ పాల్గొన్నారు.

అమరరాజా ఉద్యోగుల వార్షిక వైద్యపరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - రేణిగుంట

అమరరాజా గ్రూప్ తమ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ, నివారణాత్మక వైద్యసేవలను నిబద్ధతను నిరూపిస్తూ కరకంబాడి ప్రధాన కార్యాలయంలో 'మీ నంబర్లు తెలుసుకోండి.. మీ ఆరోగ్యాన్ని తెలుసుకోండి' అనే థీమ్‌తో వార్షిక వైద్యపరీక్షలను గురువారం ప్రారంభించింది. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరినేని, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఎన్.చంద్రబాబు, చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ ప్రశాంత్ తివారి ప్రారంభించారు.

శ్రీచైతన్యలో గ్రీన్ ఇండియా మిషన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక జయరాంరావు వీధిలో ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు చేత స్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటించారు. గొ గ్రీన్, క్లీన్ ఇండియా అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సుకన్య మాట్లాడుతూ పర్యావరణ మార్పులను, కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు చెట్లు సహాయపడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, డీన్ రమేష్, ప్రైమరీ ఇంచార్జ్ మాధవి లత, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ గౌరీ, ఏవో శివకృష్ణ, అధ్యాపక తదితరులు పాల్గొన్నారు.

బహిరంగసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయం మస్టర్ పాయింట్ వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులు ఏ.పీ. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) ఆధ్వర్యంలో జూలై 4వ తేదీన విజయవాడలో జరుగునున్న బహిరంగ సభలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మగ్దూమ్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: వైసీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధికార ప్రతినిధిగా నియామించబడ్డ సందర్భంగా మహమ్మద్ మగ్దూమ్ మొహిద్దీన్‌ను ఆయన నివాసం వద్ద వైసీపీ మైనార్టీ నాయకులు, మత గురువులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మగ్దూమ్ మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి, గూడూరు నియోజకవర్గ ఇన్చార్జ్ మేరిగ మురళీధర్, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఖాదర్బాషాలు నాపై నమ్మకంతో రెండవసారి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మైనార్టీ వర్గాల శ్రేయస్సు కోసం పోరాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో మగ్దూమ్, షానూర్, మహబూబ్, సలీం, మస్తాన్, కరీముల్లా, అబ్దుల్లా, దస్తగిరి, హుస్సేన్, అల్తాఫ్, గౌస్ బాషా, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ప్రైమరీ పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - తడ : తడ మండల అభివృద్ధి అధికారి శేఖర్ నాయక్ అండగుండాల మోడల్ ప్రైమరీ స్కూల్‌ను గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి రాగి జావ సేవించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజనం శుచిగా, రుచిగా వడ్డించాలని నిర్వాహకులకు ఆదేశించారు. పాఠశాలలోని కలుపు మొక్కలను తొలగించి, ఆవరణను పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. ఎస్టీ పిల్లల ఆధార్ కార్డులు నమోదుకు సంబంధించి హెడ్ మాస్టర్ నివేదించగా సత్వరం ఆ విషయంలో వి.ఆర్.ఓ.లకు తగిన ఆదేశాలు ఇస్తామని ప్రతి విద్యార్థి బడిలో ఉండే విధంగా చూడాలని సూచించారు.

సత్యమూర్తికి పరామర్శ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కుక్కంబాకం గ్రామానికి చెందిన వైస్సార్సీపీ యువ నాయకులు కారణి వెంకటేష్ తండ్రి కారణి సత్యమూర్తి ఇటీవల పాముకాటుకు గురై చికిత్స పొందిన అనంతరం ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న సత్యవేడు నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్, వెంకటేష్ ఇంటికి చేరుకొని సత్యమూర్తిని పరామర్శించారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి నాయుడు, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీ సాయి నాయుడు, జిల్లా కార్యదర్శి గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ బాబు రెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నియోజక వర్గ అభివృద్ధికి సహకరించండి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తదితరులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నియోజకవర్గ అభివృద్ధిలో ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం గూడూరు, వెలుగు కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆధ్వర్యంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ప్రాజెక్టులో భాగంగా గూడూరు నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు విజన్‌తో యాక్షన్ ప్లాన్ రూపొందించడం జరిగిందన్నారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని, అధికారులు, మేధావులు సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ గూడూరు నియోజవర్గ అభివృద్ధికి పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

రామారావును బదిలీ చేయాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: రామారావుని బదిలీ చేయాలని, మున్సిపల్ కార్మికుల డిమాండ్స్ అన్ని పరిష్కారం చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు గురువారం నాటికి 15వ రోజుకు చేరింది. వ్యవసాయ కార్మిక సంఘం వెంకటగిరి మండలం కమిటీ వారు శిబిరంలో కూర్చుని కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ గత పది సంవత్సరముల నుండి వెంకటగిరిలోనే తిష్టవేసి ఉన్న అక్రమాల రామారావుని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండె పోటుతో ట్రాన్స్‌కో ఏఈ మృతి

ప్రజాశక్తి - చిట్టమూరు: తిరుపతి జిల్లా, చిట్టమూరు మండలం ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలయ్య బుధవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. మృతుని బంధువుల కథనం మేరకు పోలయ్య బుధవారం ఎప్పటిలాగే విధులకు వెళ్లి సాయంత్రం విద్యానగర్ నగర్‌లోని ఆయన నివాసానికి రాగా, 9 గంటల సమయంలో గుండె నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపారు. హుటాహుటిగా ఆసుపత్రి తరలించినప్పటికీ ఆసుపత్రిలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పోలయ్య మృతి పట్ల గురువారం పలువురు సంతాపం తెలియజేశారు.

అతిథి అధ్యాపకుల ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎస్.ఆర్.ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా వున్న ఇంగ్లీషు, హిస్టరి సబ్జెక్టులను బోధించుటకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ రెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ సంబధిత సబ్జెకుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 50 శాతం మార్కులు సాదించిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను 5 వ తేది లోపల కళాశాల కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

ఆదిలోనే ఆగిన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం

- బస్టాండు స్థలమున్నా నిరుపయోగం
- షెల్టర్ చాలక ఎండకు, వానకు ప్రయాణీకుల ఇబ్బంది
- విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులకు తిప్పలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం కలగానే మిగిలింది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో దివంగత మంత్రి శివప్రసాద్ హయాంలో పెట్రోల్ బంకు సమీపంలో ఆర్టీసీ బస్టాండు ఓ దాత స్థలం విరాళంగా ఇచ్చారు. కానీ శంకుస్థాపన అనివార్య కారణాలతో ఆగిపోయింది. 15 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మారుతున్నా బస్టాండ్ నిర్మాణం గురించి పట్టించుకునే వారు కరువయ్యారు.

మండల కేంద్రం ప్రస్తుతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే కాక, జనాభా కూడా పెరిగింది. బీఎన్ కండ్రిగ సమీపంలో శ్రీసిటీ, అపాచి వంటి పరిశ్రమలు ఏర్పాడ్డాయి. పరిశ్రమలకు వెళ్లు కార్మికుల రద్దీ పెరిగినప్పటికీ బస్టాండు వసతి లేకపోవడంతో పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అరకొరగా ఉన్న బస్టాండు ఆవరణలో నాయకుల ఫ్లెక్సీలు, చిల్లర దుకాణాలు ఉండడంతో ప్రయాణికులకు అసౌకర్యంగా ఉంటోంది. మండల కేంద్రంలో ఒక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 20కి పైగా ప్రాథమిక పాఠశాలలు, ఐదు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటికి చేరుకోవడానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు బస్టాండు లేకపోవడంతో ఎండకు, వానకు రోడ్డుపై నిలుచుని ఇబ్బంది పడుతున్నారు. అంతేకాక బస్టాండు పక్కనే మద్యం దుకాణం ఉండడంతో మందు బాబులు అక్కడే మద్యం సేవించి, అక్కడక్కడే తిరుగుతూ, ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కంపెనీల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు బస్టాండ్ ఆవరణ వదిలి ఇంకాస్త ముందు ఖాళీ ప్రదేశం ఉండడంతో అక్కడ ఆగి బస్సులు ఎక్కడం అలవాటుగా మార్చుకున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిరాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రయాణీకులు విమర్శిస్తున్నారు. బస్టాండ్ పరిస్థితి ఇలా ఉంటే, ఆటోవాలాలు ఆటో నిండుగా జనాలనెక్కించుకుని బస్టాండ్ దగ్గర ఆపుతున్నారు. దీంతో బస్సులు బస్టాండ్ ఆవరణ నుంచి 20 30 మీటర్ల దూరంలో బస్సులు ఆపుతున్నారు.

మహిళలు, చిన్నారులు, వృద్ధులు బస్సు ఎక్కాలంటే ఇబ్బంది పడుతున్నారు. బస్సు దగ్గరకు వెళ్లేలోగా బస్సులు వెళ్లిపోతున్నాయని ఆరోపించారు. పంచాయతీ అధికారులు, ఉన్నత స్థాయి అధికారులు స్పందించి బస్టాండ్ నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పుడున్న చిన్నపాటి బస్టాప్ ప్రయాణీకులు అవసరాలు సరిపోవడం లేదని, ఎండకు, వానకు ఇబ్బందిగా ఉందని తెలియచేస్తున్నారు. అధికారులు స్పందించి బస్టాండుకు స్థలం ఎక్కువగా ఉంది కాబట్టి బస్టాండ్‌ని పెంచి నిర్మాణం జరిగేలా చూడాల్సి ఉంది.

ఫ్లెక్సీల మోత.. బస్టాండు రోత..!

బస్ షెల్టరా..? బైకుల షెల్టరా..!

బడికి పోవాలంటే బస్సు ఎక్కాలంటే.. తప్పని తిప్పలు

ఇది తొలి అడుగే.. ముందున్నాయ్ మరిన్ని

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : సంక్షేమం, అభివృద్ధిలో ఇది తొలి అడుగు మాత్రమేనని, ముందున్నాయి మరిన్ని అడుగులని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యకర్తలతో కలిసి ఏడాది పాలనలో కూటమి సాధించిన అభివృద్ధిపై కరపత్రాలు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తిలో ఇప్పటివరకు మంచి పాలన జరిగిందని, రౌడీయిజాన్ని రూపుమాపామన్నారు. రానున్న నాలుగేళ్లలో శ్రీకాళహస్తిని మోడల్ సిటీగా తీర్చి దిద్దేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, కంటా రమేష్, శ్రీనివాస్ రెడ్డి, చెంచయ్య నాయుడు, కాసరం రమేష్, దుర్గా, ప్రతాప్, షాకీర్ అలీ, సుబ్బయ్య, గోపినాథ్, రుకేష్, షఫీ, గోపి, యస్వంత్, అర్ముగం, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలి రూ.300 గిట్టుబాటయ్యేలా చూడండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, పల్లమాల పంచాయతీ, చెరువులో జరుగుతున్న పూడిక తీత, కట్ట బలోపేతం పనులను గురువారం ఉపాధి హామీ పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. ఆయన ఉపాధి హామీ శ్రామికులతో మాట్లాడుతూ10 మంది శ్రామికులు ఒక గ్రూప్‌గా ఏర్పడి పనిని విభజించుకోవాలని సూచించారు. 300 రూపాయలు రోజువారీ వేతనం పొందుతూ, వారానికి1800 రూపాయలు, 100 రోజులకి 30,000 వేల రూపాయలు ఒక ఆర్థిక సంవత్సరంలో వేతనం పొంది కుటుంబం ఆర్థిక స్థితి గతులు మెరుగు పరచుకోవాలన్నారు. ప్రతీ ఇంటి వద్ద వర్మీ కంపోస్ట్ పిట్ లు, రైతులు పొలాల్లో ఫారం పాండ్‌లు త్రవ్వు కోవాలని సూచించారు. రైతులకు అందిస్తున్న మొక్కల వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, పల్లమాల పంచాయతీ సెక్రటరీ జలశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలు అవసరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యార్థులలో వ్యాపార నైపుణ్యాలను, సృజనాత్మక శక్తులను వృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐక్యరాజ్యసమితిలోని యూనిసెఫ్‌తో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌తో కలిసి సంయుక్త ఆధ్వర్యంలో 'యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్' కార్యక్రమం ప్రారంభించిందని డాక్టర్ చంద్రమౌళి తెలిపారు. ఈ విషయమై బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి కోటేశ్వరయ్య, కార్యక్రమ కళాశాల కోఆర్డినేటర్లు డాక్టర్ తిరుమలయ్య, డాక్టర్ నర్సింహారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రొట్టెలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అఖిల భారత ఎల్ఐసి ఉద్యోగుల సంఘం 75వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పుత్తూరు ఏరియా హాస్పిటల్‌లో రోగులకు ఎల్ఐసి ఉద్యోగులు బ్రెడ్, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కార్యదర్శి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, సీనియర్ ఫార్మా ఆఫీసర్ అన్నాదొరై, ఎల్ఐసి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు దస్తగిరి, నాయకులు మహారాణి, రాజేశ్వరి, ఆంజనేయులు, రాజేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సుకన్యకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు జంతు శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని టి.సుకన్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజా మాణిక్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమె అదే విభాగానికి చెందిన అధ్యాపకులు ఆచార్య కిశోర్ పర్యవేక్షణలో " ఎవాలు యేషన్ ఆఫ్ బయోకెమికల్ పెరామీటర్స్ ఇన్ స్ట్రెప్టొజొటాసిన్ (ఎస్టిజడ్) ఇండ్యూజ్డ్ టైప్ టు డయాబెటిక్ ర్యాట్ అసోసియేటెడ్ విత్ ది ట్రీట్మెంట్ ఆఫ్ మెట్ ఫార్మిన్ అలాంగ్ విత్ మెగ్నీషియం అండ్ విటమిన్ డి" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, పరిశోధకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు కాపాడండి

- ఎల్ఏసాగరం చెరువు ఆక్రమణలపై కలెక్టర్‌కు లేఖ
- అడ్డుకోకపోతే భవిష్యత్తులో భారీ నష్టం
- ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలంటే కోట్లు పెట్టి కొనాలి : లాయర్ వెందోటి పార్థసారధి రెడ్డి

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలో కొంత మంది అక్రమదారులు ఎల్ ఏ సాగరం చెరువును ఆక్రమించుకుని భారీ కట్టడాలకు ప్రయత్నాలు చేస్తున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినట్లు లాయర్ పార్థసారధి రెడ్డి తెలిపారు. నాయుడుపేట సీనియర్ లాయర్, మాజీ బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వెందోటి పార్థసారధి మాట్లాడుతూ నాయుడుపేట పట్టణం క్రమంగా అభివృద్ధి చెందుతుండడంతో ఎక్కడబడితే అక్కడ ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కొంతకాలంగా కొందరు ఆక్రమణదారులు ఎవ్వరిని లెక్క చేయకుండా ఇష్టానుసారం ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. వీరు బహిరంగంగానే అక్రమణలకు పాల్పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. అధికారులు సైతం వారికి వంత పాడుతూ సహకరిస్తున్నారన్నారు. తద్వారా ప్రభుత్వ స్థలాలు కనిపించకుండా మాయమైపోతున్నాయన్నారు. ఈ క్రమంలో ఎల్ఏ సాగరం చెరువు సైతం దురాక్రమణకు గురవుతుందని చెప్పారు. నాయుడుపేట పూతలపట్టు మధ్య సిక్స్ వే ఏర్పడడంతో ఆ చుట్టుపక్కల ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములపై ఆక్రమణదారులు పంజా విసురుతున్నారని, వీరిని అడ్డుకోకపోతే రేపు ప్రజాపాలనకు అవసరమైన కార్యాలయాల నిర్మాణంకోసం ప్రజాధనం కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వమే కొనుగోలు చేయవలసిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ఎల్ ఏ సాగరం చెరువు స్థలాన్ని అధికారులు గుర్తించి సరిగ్గా ఉపయోగించుకుంటే ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించుకునేందుకు ఉపయోగపడుతుందని ఈ విషయాలన్నీ వివరించి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాయడం జరిగిందని ఆయన తెలిపారు.

గోవిందరాజ స్వామి ఆలయ సమీపంలో అగ్ని ప్రమాదం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి శ్రీ గోవింద రాజస్వామి ఆలయం రాజ గోపురం సమీపంలో బుధవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాద సంభవించింది. ప్రమాదం అర్ధరాత్రి జరగడంతో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. జిల్లా అదనపు అగ్నిమాపక శాఖ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి కథనం మేరకు తిరుపతి గోవిందరావు స్వామి ఆలయంలోని రాజగోపురం ముందున్న శ్రుతి మెటల్స్ షాపులో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భారీ ఎత్తున మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన చుట్టుపక్కల వారు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వారు ఫైర్ ఇంజన్లతో రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదానికి గురైన షాపుకు ఎలాంటి ప్రమాద బీమా లేదని, అగ్నిమాపక భద్రత చర్యలు కూడా తీసుకోలేదని తెలిపారు. సుమారు 30 లక్షల రూపాయలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష

అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సన్నిది ప్రాంతాన్ని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష సందర్శించారు. నగర పాలక సంస్థ విపత్తు నివారణ, అగ్ని మాపక శాఖ అధికారి శ్రీనివాస రావుతో కలిసి అగ్ని ప్రమాదానికి గురైన షాపును, సన్నిది వీధిలో ఉన్న ఇతర షాపులను సందర్శించి ఘటన కారణాలను అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదానికి గురి అయిన షాపుతో సహా మొత్తం పరిస్తితిపై నివేదిక ఇవ్వాలని నగర పాలక సంస్థ విపత్తు నివారణ శాఖను ఆదేశించారు.

ఏటీఎం కార్డుల దొంగ అరెస్టు

ప్రజాశక్తి - రేణిగుంట: ఏటీఎం కార్డులను దొంగిలించి, డబ్బులు విత్ డ్రా చేసే తల్ల శ్రీనివాసులు రెడ్డి గాజులమండ్యం పోలీస్ స్టేషన్ సీఐ మంజునాథ్ రెడ్డి, వారి సిబ్బంది అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు వివిధ ప్రాంతాల్లో ఏటియంల వద్ద నిందితుడు తిరుగుతుండేవాడని, ఎవరైనా ఏమరుపాటుగా ఏటియం కార్డు మర్చిపోతే వెంటనే కార్డు ఉపయోగించి డబ్బులు డ్రా చేసేవాడని తెలిపారు. గురువారం ఎల్లమండ్యం ఏటీఎంసెంటర్ వద్ద అతను అనుమానాస్పదంగా ఉండగా పట్టుకుని, అతని వద్దనుండి కొంత నగదు, ఏటీయం కార్డులు, స్వైపింగ్ మిషన్, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదుచేసి కోర్టుకు విచారణకు పంపుతామని తెలిపారు.

స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్వర్ణాంధ్ర 2047లో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయున్నట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పంచాయతీరాజ్ అతిధి గృహంలో స్వర్ణాంధ్ర 2047పై తొలి శాఖల అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధి యాక్షన్ ప్లాన్ పై ఎమ్మెల్యే అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం మెప్మా విభాగం ఆర్పీలకు ట్యాబ్ లు పంపిణీ చేశారు.

ఉన్నత పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధి లోని, రాచపాళెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను, పుత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి మహేశ్వర రావు గురువారం తనిఖీ చేశారు. వివిధ రికార్డులు పరిశీలించారు.

IN THE COURT OF THE III ADDL. DISTRICT JUDGE: TIRUPATI
I.A.No. 645/2024, O.S.No. 145 / 2014
N. Prabhavathi and another ...Petitioners
V/s
B.Parthasaradhi Naidu (died) & Others ...Respondents
Notice to the Respondent No.8, 9 & 10
R8) B.Bhargavi W/o K.Sandeep
R9) K.Sandeep S/o K.Bhaskar Naidu
Both are residing at D.No. 5-5-300, Sarojinidevi Layout, Tirupati
R10) M.Ravi S/o M.Venkata Krishnaiah, Kotala Village, Chandragiri Mandal, Tirupati District
పై కనిన Petitionలో 8,9,10 రెస్పాండెంటుకు నోటీసు నిమిత్తం తేది. 11.07.2025 ఉదయం 10.30 గంటలకు పై కనిన 8, 9, 10 రెస్పాండెంటులు పై కనిన కోర్టులో హాజరై సమాధానం చెప్పుకోవలసినదిగా కోర్టువారు వాయిదా వేసియున్నారు. రాని యెడల పరోక్షముగా తీర్మాణించబడును.
వాయిదా తేది. 11.07.2025
P.PRABHAKAR NAIDU
ADVOCATE, TIRUPATI

IN THE COURT OF II[nd] Addl. JUNIOUR CIVIL JUDGE; TIRUPATI
O.S.No. 481 / 2024
Indian Bank, Main Branch, Thondawada Branch, rep., by its Branch Manager ...Plaintiff
V/s
G.Mahendra Reddy and another ...Defendants
SUMMONS TO DEFENDANT No's 1 and 2
D1) G.Mahendra Reddy S/o G.Ramakrishna Reddy D.No.326/1/3, 2nd floor, Sai Nagar, Tirupati.
D2) P.Ashok Reddy S/o Mohan Reddy R/o D.No.58/4, 2nd Floor, Kesavayanigunta, Near Anantha Law College, Tirupati
Please take summons that the above suit filed by the plaintiff for recovery of amount against defendants No.1 and 2 and the matter is posted to 28.7.2025 for defendants No.1 and 2 appearance either in person or through your counsel at about 10.30 a.m. in the above court. In the event of your absence, the matter will be decided exparte.
Date of hearing 28.7.2025
K.RAMESH BABU
ADVOCATE, TIRUPATI

IN THE COURT OF THE III ADDL. DISTRICT JUDGE: TIRUPATI
I.A.No. 644/2024, O.S.No. 145 / 2014
N. Prabhavathi and another ...Petitioners
V/s
B.Parthasaradhi Naidu (died) & Others ...Respondents
Notice to the Respondent No.8, 9 & 10
R8) B.Bhargavi W/o K.Sandeep
R9) K.Sandeep S/o K.Bhaskar Naidu
Both are residing at D.No. 5-5-300, Sarojinidevi Layout, Tirupati
R10) M.Ravi S/o M.Venkata Krishnaiah, Kotala Village, Chandragiri Mandal, Tirupati District
పై కనిన Petitionలో 8,9,10 రెస్పాండెంటుకు నోటీసు నిమిత్తం తేది. 11.07.2025 ఉదయం 10.30 గంటలకు పై కనిన 8, 9, 10 రెస్పాండెంటులు పై కనిన కోర్టులో హాజరై సమాధానం చెప్పుకోవలసినదిగా కోర్టువారు వాయిదా వేసియున్నారు. రాని యెడల పరోక్షముగా తీర్మాణించబడును.
వాయిదా తేది. 11.07.2025
P.PRABHAKAR NAIDU
ADVOCATE, TIRUPATI

క్రైం న్యూస్

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి వ్యక్తి బలి

మృతి చెందిన కందుకూరి మునీశ్వర్

ప్రజాశక్తి - నాయుడుపేట: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం బలైపోయిందని మహాలక్ష్మి నగర్ వాసులు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మరణించిన దుర్ఘటన నాయుడుపేటలో గురువారం చోటుచేసు కుంది. మహాలక్ష్మి నగర్‌లో విద్యుత్తు లైన్లు సరిగా లేవని పలుమార్లు విద్యుత్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా వారు మరమ్మత్తులు చేపట్టకపోవడంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నామని ఆ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం జరుగునున్న టీడీపీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి షామియానా సిద్ధం చేస్తూ విద్యుత్ షాక్ తగలడంతో మున్సిపాలిటీ పరిధి, తుమ్మూరుకి చెందిన కందుకూరి మునీశ్వర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే విజయశ్రీ ఓదార్పు

తమ పార్టీ కార్యక్రమానికి వచ్చి అసువులు బాసిన మునీశ్వర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. పార్టీ ఇన్చార్జ్ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి పట్టణ అధ్యక్షులు ఎస్.కే.రఫీ, నెలవల రాజేష్‌లు మృతిని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం

అధికార పార్టీ కార్యక్రమం కోసం వెళ్లి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మునిశ్వర్ కుటుంబానికి సిపిఎం అండగా ఉంటుందని శివ కవి ముకుంద హామీ ఇచ్చారు. ఆయన సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీ తో కలిసి మునీశ్వర్ నివాసానికి వెళ్లి ఆయన పార్థివా దేహానికి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ టడీపీ నాయకులు 10 లక్షలు, ప్రభుత్వం 25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆటో బోల్తా పడి వృద్ధుడు మృతి

మృతి చెందిన చెంచయ్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధి, విందూరు, ఎస్.టి. కాలనీ వద్ద ఆటో బోల్తా పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు మృతుడు విందూరు ఎస్టీ కాలనీకి చెందిన చిల్లకూరు చెంచయ్య (69) అని తెలిపారు. మృతుడు జోగి పల్లిలో జరిగే పీర్ల ఉత్సవానికి నలుగురితో కలిసి ఆటోలో వెళుతుండగా, విందూరు గ్రామ పరిధిలోని చర్చి వద్ద ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన చెంచయ్యను హుటాహుటిన ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారని తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారని స్థానికులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - వాకాడు : తిరుపతి జిల్లా, వాకాడు మండలం, దుగరాజపట్నం ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న మురారి వెంకటయ్య నివసించే పూరిల్లు గురువారం షార్ట్ సర్క్యూట్‌కు గురై దగ్ధమైంది. బాధితులు పశువులు మేపుకుంటూ జీవనం సాగిస్తుంటారు. మధ్యాహ్నం భోజన సమయానికి ఇంటికి వచ్చేటపృటికి ఈ సంఘటన చోటు చేసుకుంది. చుట్టుపక్కల ఉన్న యువకులు మంటలను అదుపు చేయుటకు ప్రయత్నించారు. ఫైర్ ఇంజన్‌కి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంటిలో ఉన్నటువంటి వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఎటువంటి ప్రాణహాని కలుగలేదు. బాధితులు ప్రభుత్వం సహాయం చేయాలని వేడుకున్నారు.

వివాహిత ఆత్మహత్య.. బంధువుల ఆందోళన

మృతురాలు శిల్ప, హైవేపై ఆందోళనకు దిగిన ఆమె బంధువులు

ప్రజాశక్తి - తడ : తడ మండలం, అక్కంపేట ఎరుకల కాలనీలో చిత్తూరు జిల్లా, కుప్పానికి చెందిన శిల్ప(21)అనే వివాహిత మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న ఆమె బంధువులు అక్కంపేట చేరుకుని నేషనల్ హైవేపై ఆందోళనకు దిగారు. మహిళ మృతదేహాన్ని కిందకు కూడ దించకుండా రోడ్డు బ్లాక్ చేసి వాహనదారులకు అంతరాయం కలిగించారు. మృతురాలి భర్త కార్తీక్ పై ఇదివరకు పలు మార్లు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. భార్య భర్తలు ఇరువురు శ్రీసిటీలో పనిచేస్తున్నారని, వీరు తరచూ గోడవలు పడుతుండే వారన్నారు. భర్త, అతని కుటుంబ సభ్యులపై అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలికి ఒక పాప హేమశ్రీ (3), ఒక బాబు హర్ష (2) ఉన్నారని వారు అనాదలైనారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వారికి నచ్చచెప్పి, కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

వ్యక్తిపై కత్తితో దాడి

గాయాలతో కేశవులు

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, గుండ్లకండ్రిగ ఎస్టీ కాలనీ నివాసి కేశవులు (55)పై, అదే గ్రామానికి చెందిన సీతారామ య్య గురువారం కత్తితో తీవ్రంగా దాడి చేయడంతో కేశవులుకి బలమైన రక్త గాయాలయ్యాయి. గ్రామస్తులు108 వాహనంలో ఎస్వీఆర్ హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న ఏర్పేడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాజశ్రీ పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
O.S.No.115 of 2022
వాది: శ్రీమతి కొనకంచి రాధ
ప్రతివాది: శ్రీ రాటకొండ యుగంధర్
TO
శ్రీ రాటకొండ యుగంధర్, తండ్రి లేట్ కృష్ణమనాయుడు, చెరువుముందరపల్లి విలేజ్ అండ్ పోస్ట్, చిన్నగొట్టిగల్లు మండలం, తిరుపతి జిల్లా.
దావా సమను
పై కనిన ప్రతివాదికి తెలియజేయడమేమనగా పైకనిన వాది అయిన శ్రీమతి కొనకంచి రాధా అగ్రిమెంటు విషయమై రాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పీలేరు వారి కోర్టులో వ్యాజ్యం నెంబర్ 115 ఆఫ్ 2022 ను దాఖలు చేసి ఉన్నారు. తమరు సదరు కేసులో హాజరు అవుటకుగాను 08-07-2025వ తేదీన వాయిదా ఉన్నది. కాబట్టి మీరు సదరు వాయిదాకు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు నందు హాజరు కావాలని కోర్టు ఆదేశాల మేరకు నోటీసు ఇవ్వడం జరిగినది. అట్లు మీరు హాజరు కానియెడల మీ పరోక్షమున తీర్పు వెలువడనని తెలపడమైనది.
ఇట్లు
వి. చిన్న రెడ్డప్ప
అడ్వకేట్, పీలేరు
మొబైల్ నెంబర్:9440540769

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: ఏ. ఐ. బి. ఈ.ఏ యూనియన్ 75 వ వార్షికోత్సవాల్లో వార్షోత్సవాల్లో గూడూరు, ఓం శ్రీ సాయి వృద్ధాశ్రమంలో నిత్యవసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా మీరా సాహెబ్, ఏ.ఏ.ఓ శర్మ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి ఎన్ శివకుమార్, అధ్యక్షులు మనోజ్ కుమార్, కార్యదర్శి ఎన్ శివకుమార్ , వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ మహబూబ్ బాషా , శర్మ ఆఫీసర్, షేక్ మీరా సాహెబ్, యోగి, పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి - తొట్టంబేడు : మండలంలోని కాసరం పంచాయతీ, ప్రాథమిక పాఠశాలలో శ్రీకాళహస్తి, విక్రమ్ కళాశాల యాజమాన్యం మునిలక్ష్మి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు పంచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ విక్రమ్ కళాశాల వారు పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ కళాశాల సిబ్బంది మల్లికార్జున, సునీత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన మెను పాటించండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ- పాఠశాల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని ఎంఇవో మునిసుబ్రమణ్యం సూచించారు. ఆయన గురువారం బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాల, నిర్మాటకట ప్రాథమిక పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే, నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సామాన్యులపై రాజకీయ కక్షలు వద్దు

సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

ప్రజాశక్తి - వాకాడు : తిరుపతి జిల్లా, వాకాడు మండలం, వాకాడులో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కొడవలూరు దామోదర్ రెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి నాయకులు రాజకీయ కక్షలు తమపై చూపాలని, పేదలపై కాదని సూచించారు. గ్రామంలో జరుగుతున్న అక్రమాలపై ఎంపీడీఓ సమక్షంలో ఎస్ఆర్ఈజీఎస్ ఏపీఓను ప్రశ్నిస్తే ఆ ప్రశ్నించిన వివాదం దౌర్జన్యమా అని ప్రశ్నించారు. 40 వేల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న జడ్పిటిసికి అర్హత లేదా అని నిలదీశారు. సంఘటన జరిగిన 24 గంటల తర్వాత ఏపీఓ ద్వారా ఫిర్యాదు స్వీకరించారు, జడ్పిటిసి సహా ఐదు మందిపై కేసు నమోదు చేయడం అందులో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేయడం దారుణమన్నారు. పోలీస్ ఇన్వెస్టిగేషన్లో టిడిపి అధ్యక్షుడిని ఎస్సై తమ పక్కన కూర్చుని పెట్టుకోవడంలో ఆంతర్యం ఏమిటన్నారు. వాకాడులో ఎన్నడు లేని విధంగా నూతన సాంప్రదాయానికి కూటమి నాయకులు తెరలేపుతున్నారన్నారు. ఇకనైనా ఈ పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

టొయోటాలో సర్వీస్ క్యాంపెయిన్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టయోటా కిర్లోస్కర్ మోటార్స్ తమ షోరూముల్లో సర్వీస్ క్యాంపెయిన్ ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆ సంస్థ సౌత్ రీజన్ చీఫ్ రిప్రజెంటేటివ్ వైస్ ప్రెసిడెంట్ సిగామణి మాట్లాడుతూ ఈ సర్వీస్ క్యాంపెయిన్ ద్వారా సర్వీసు, బైట్స్, ఉపకరణాలతో పాటు మరికొన్నింటిపై అద్భుతమైన ఆఫర్లు అందిస్తున్నామన్నారు. టైర్, బ్యాటరీ పరీక్షతో 20-పాయింట్ల ఉచిత వాహన తనిఖీ, లేబర్ ఛార్జీలపై 10% వరకు తగ్గింపు, ఇంటీరియర్ క్లీనింగ్, విండ్‌షీల్డ్ పాలిష్, హెడ్‌ల్యాంప్ పునరుద్ధరణ, టైర్లు, బ్యాటరీలపై ఆకర్షణీయమైన ఆఫర్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేణుకను పరామర్శించిన రిషితా రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న టిడిపి మహిళా విభాగం సీనియర్ నేత రేణుకమ్మను గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి పరామర్శించారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ అన్ని విధాల రేణుకమ్మకు అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు.

కరకట్టపై భద్రత పెంచండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్వర్ణముఖి నది ఒడ్డువెంబడి కరకట్టపై భద్రత పెంచాలని పలువురు వృద్ధులు పోలీసులను కోరారు. గురువారం సిఐ గోపి సాధారణ తనిఖీల్లో భాగంగా అటువైపు వెళ్లగా వాకింగ్ చేస్తున్న వృద్ధ మహిళలతో మాట్లాడారు. ఇటీవల కాలంలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని బంగారు గొలుసులను లాక్కెళ్తున్న నేపథ్యంలో కరకట్ట వద్ద భద్రత ఏర్పాటు చేయాలని సిఐని కోరారు. స్పందించిన సిఐ గోపి తప్పకుండా గస్తీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

దినదినాభివృద్ధి చెందుతున్న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం

ప్రజాశక్తి - క్యాంపస్ : సంస్కృత భాషాధ్యాపనంలో అగ్రగామిగా ఉన్న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విభిన్న విభాగాలలో పనిచేస్తున్నటువంటి ఆచార్యులను పురస్కారాలు వరించాయి. విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నారావు సభాభవనంలో జరిగిన సన్మాన, ప్రపంచ సంస్కృత సదస్సు యొక్క ముఖ్యాంశ వర్ణన సందర్భంలో విశ్వవిద్యాలయం వి.సి ప్రొ. జిఎస్ఆర్ కృష్ణమూర్తి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విశిష్టాద్వైత వేదాంత విభాగ అధ్యక్షులు ఆచార్యులు కేఈ దేవనాదన్‌కి, శాస్త్ర రత్నాకర, ఆగమ విభాగ ఆచార్యులు దర్శన స్కూల్ డీన్ ప్రొ. వి.విష్ణు భట్టాచార్యులుకి, వైఖానస ఆగమ, సాహిత్య విభాగ ఆచార్యులు, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.సి.రంగనాథన్ కి, విద్వద్యుమణి, మీమాంస విభాగ అధ్యక్షులు డా.టి.ఎస్.ఆర్ నారాయణకి, ఉభయ మీమాంసారత్న అనేటువంటి బిరుదులను అహోబిలం మఠం వారిచే ఇవ్వడం జరిగిందన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి, విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నటువంటి ఆచార్యుల జ్ఞానవృద్ధికి ప్రతీకలుగా నిలుస్తాయని వివరించారు. ఈ సందర్భంగా వారందరిని విశ్వవిద్యాలయం తరపున సన్మానించారు.

19 ప్రపంచ సంస్కృత సదస్సు విశేషాలు

ఈనెల నేపాల్ దేశంలో జరిగినటువంటి 19వ ప్రపంచ సంస్కృత సదస్సుకు విశ్వవిద్యాలయం తరపున ఆచార్యులు, కులపతులు పాల్గొని రావడం జరిగినదని, ఈ ప్రపంచ సంస్కృత సదస్సు ప్రత్యేకించి సంస్కృత భాషాభివృద్ధికి చేయవలసిన టువంటి విషయాలు ఏవైతే ఉన్నాయో వాటిపైన ప్రత్యేకించి చర్చించడం జరిగినదని తెలిపారు.

ఈ సదస్సులో ముఖ్యంగా 1. హయ్యర్ ఎడ్యుకేషన్లో సంస్కృత భాషాభివృద్ధికి చేయవలసిన పనులు 2. సంస్కృత భాష భారతీయ జ్ఞాన పరంపర ఈ అంశం పైన విశేష కృషి చేయాలని 3. పాళీ, ప్రాకృతం సంస్కృతం ఈ భాషలను ఆధునిక తరానికి స్పష్టంగా అందించాలని ఈ భాషల్ని అభివృద్ధి పరచాలని నిర్ణయించడం 4. మల్టీ లింగ్వల్ మల్టీకల్చరల్ విద్యా వ్యవస్థను ముందుకు తీసుకువెళ్లాలని తద్వారా అన్ని భాషలు అన్ని సంస్కృతులు సమ్మేళనమయి అందరూ కూడా చక్కగా ఉన్నత జ్ఞానాన్ని పొందుతారని 5. సంస్కృత భాషలో ఉన్న మాతృకా గ్రంథాలను సంరక్షించి, వాటిని డిజిటలైజేషన్ చేసి భావితరానికి అందించాలని నిర్ణయించడం 6. పరిశోధనలు ప్రత్యేకించి నిత్య నూతన ఆవిష్కృతంగా ఉండేలాగా ఆధునిక సమాజానికి అవసరమయ్యే పరిశోధనలు చేసేలాగా రూపురేఖలు నిర్వహించాలని 7. సంస్కృత భాషలో ఏఐ టెక్నాలజీని ఉపయోగించి టెక్నాలజీని కూడా సంస్కృత భాషలో అడాప్ట్ చేసుకొని తద్వారా సంస్కృత భాషను టెక్నాలజీ ద్వారా ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయించడం 8. ఎన్.ఇ.పి 2020 భవిష్యత్తు తరాలకు ఏ విధంగా మార్గదర్శకం ఉండాలి అనే అంశాల పైన ఈ సదస్సులో చర్చించడం జరిగిందని సూచించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు మాట్లాడుతూ గొప్ప గొప్ప విద్వాంసులు ఉన్నటువంటి ఈ సంస్కృత విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధి పొందుతూ ముందుక వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, విశిష్టాద్వైత వేదాంత విభాగ అధ్యక్షులు ప్రొ. కేఈ దేవనాథన్, దర్శన స్కూల్ డీన్ ప్రొ.వి.విష్ణుబట్టాచార్యులు, సిడిఓఈ డైరెక్టర్ ప్రొ.సి. రంగనాథన్, విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

9న సమ్మెపై యస్వీయులో కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తీసుకొచ్చింది, వీటిని రద్దు చేయాలని కోరుతూ ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ, ఆప్కాస్ సంస్థల ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీలో గురువారం కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే కార్మికులు బానిసత్వంలోకి నెట్టబడతారని తెలిపారు. వివిధ హక్కులను కోల్పోతారని హెచ్చరించారు. ఈ కరపత్రం ఆవిష్కరణలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్. జయచంద్ర, అప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. చిన్నబాబు, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్, యస్వీయు వర్క్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రాజేంద్ర, కార్యదర్శి మురగయ్య, కోశాధికారి గణేష్, కమిటీ సభ్యులు రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ఆరోపణలపై టీటీడీ అధికారుల వివరణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: గురువారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు శ్రీవాణి దర్శనాలకు వచ్చిన నలుగురు భక్తులు మీడియాతో మాట్లాడుతూ శ్రీవాణి టికెట్ల జారీలో ఆలస్యమవుతోందని, మంచి గదులు కేటాయించడం లేదని ఆరోపించారు. ఈ విషయమై టీటీడీ అధికారులు వివరణనిస్తూ.. ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలకు శ్రీవాణి టికెట్లు జారీ చేయడం జరుగుతోందని, గంట ముందు వస్తే మాత్రమే భక్తులను కౌంటర్ వద్దకు అనుమతిస్తున్నామని తెలిపారు. అయితే సదరు భక్తులు వేకువఝామున 3.30 గంటలకు వచ్చి నిరీక్షించి, టికెట్ల కేటాయింపులో జాప్యం జరిగిందనడం సరికాదన్నారు. ఎటువంటి అన్నపానీయ సౌకర్యాలను టీటీడీ కల్పించలేదని ఆరోపించడం సత్య దూరమన్నారు. టికెట్ కౌంటర్ తెరిచే సమయానికి ముందు నుండి టీ, కాఫీ, పాలు, మజ్జిగ నిరంతరం సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. కొందరు కేటాయించిన గదుల్లో బొద్దింకలు ఉన్నాయని ఆరోపణలు చేశారని, సిబ్బందిని పంపి పరిశీలించామని ఆ ఆరోపణలు కూడా అసత్యమని వివరించారు. ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయం మేరకు టీటీడీపై అసత్య ఆరోపణలు చేస్తూ సంస్థ ప్రతిష్టను దిగజార్చే వారిపై టీటీడీ చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో వసతి గదుల విషయంలో భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సుపరిపాలనపై టిడిపి ఇంటింటి ప్రచారం

కమ్మపల్లిలో తొలి అడుగుపై ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - రామచంద్రాపురం : రాష్ట్రంలోని పేదలు, కార్మికుల కడుపు నింపడానికి ప్రభుత్వం 203 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం టిడిపి అధికార ప్రతినిధి ఎన్. చిన్నబాబు అన్నారు. గురువారం మండలంలోని కమ్మపల్లి పంచాయతీ నందు సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో అవినీతి, ఇసుక, మట్టి, లిక్కర్ స్కాములకు పాల్పడి ప్రజాధనాన్ని దోచుకున్నదే తప్ప.. అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసి గ్రామాలను అభివృద్ధికి అమలు దూరంలో ఉంచిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను రూ. 1000 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. టిడిపి ప్రభుత్వం హయాంలోని పల్లె పండుగ.. సందర్భంగా గ్రామాలలో సిసి రోడ్లు, మురికినీటి కాలువలు, ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడంతో భావన నిర్మాణరంగం అభివృద్ధి చెంది, కూలీలకు, మేస్త్రీలకు కాంట్రాక్టర్లకు పనులు కల్పించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు తిరుమలరెడ్డి సీనియర్ నాయకులు జనార్ధన్ చౌదరి నరసింహారెడ్డి, కోరా హరిప్రసాద్, రావిళ్ళ గిరిబాబు సురేష్ నాయుడు సివి ప్రసాద్ మధుసూదన్ రెడ్డి, నీలకంఠ చౌదరి, మురళి నాయుడు, రామిరెడ్డి, సురేంద్ర నాయుడు ధనంజయ రెడ్డి, సి రవి, బాల ప్రసాద్, మధు నాయుడు, బాలకృష్ణ మణి నాయుడు, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల కొండపై గత పాలకుల అవినీతిపై

చంద్రబాబుకు లేఖ రాస్తా : రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

ప్రజాశక్తి - తిరుమల: జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమలలో చాలా అక్రమాలు జరిగాయని, బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ఆరోపించారు. గతంలో ఉన్న టీటీడీ పాలకమండళ్లు భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాయని విమర్శించారు. గురువారం ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారి లడ్డూలో జరిగిన కల్తీ భక్తులను ఆందోళనకు గురిచేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తానని పేర్కొన్నారు.

గ్రామస్థాయిలో సమస్యలను పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే పులివర్తి నానికి హారతి ఇస్తున్న జయశంకర్ కాలనీ ప్రజలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గ్రామస్థాయిలో ఉన్న అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని హామీ ఇచ్చారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు గురువారం మంగళం పరిధి, తిరుమల నగర్ గ్రామపంచాయతీ జయశంకర్ కాలనీలో పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే పులివర్తి నాని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ పనితీరు, కూటమి ప్రభుత్వ ఏడాది పనితీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట తిరుమల నగర్ టిడిపి గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గోవిందరాజులు, చెన్నరాయప్ప, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల బతుకు మీద దెబ్బ కొట్టొద్దు

ప్రజాశక్తి - నాయుడుపేట:నాయుడుపేటలో జూలై 1వ తేదీ మంగళవారం సాయంత్రం మినీ ట్రక్, వ్యాన్ల స్టాండ్ వద్ద జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా నాయకులు, మండల నాయకులు లక్ష్మీ, శివకవి ముకుంద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చినప్పటి నుండి కార్మికులను బానిసలుగా మార్చాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. నాయుడుపేట మున్సిపాలిటీ కమిషనర్ మీని వ్యాన్ స్టాండ్ స్థలాలు ఆక్రమించుకొని వ్యాన్ డ్రైవర్లు బతుకులపై దెబ్బ కొట్టడానికి చూస్తున్నారని ఆరోపించారు. జూలై 9 జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మస్తాన్ రెడ్డి, సతీష్, జిలాని, హేమంతు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, అక్రమ మద్యాన్ని నివారించాలి: శ్రీనివాసచారి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న నాగమల్లేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో గంజాయి, అక్రమ మద్యాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించడానికి సమిష్టి కృషిగా సిబ్బంది పని చేయాలని చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస చారి, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర్ రెడ్డిలు సూచించారు. తిరుపతి డివిజన్ పరిధిలోని 6 ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ల ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బందితో గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎక్సైజ్ ఐ యాప్, క్యూఆర్ కోడ్ సర్వే, సీసీ కెమెరాల పర్యవేక్షణ, ఐ ఘాట్ కర్మయోగి, ఆన్లైన్ ఎఫ్ఐఆర్లపై వర్క్ షాపును నిర్వహించి రోజువారి విధులలో వీటిని ఎలా ఉపయోగించాలి, సాంకేతికంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎదుర్కొనే సమస్యలపై మార్గదర్శకాలను తెలిపారు. ఎక్సైజ్ నేరాలు పూర్తిస్థాయిలో నియంత్రించడానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో వాసుదేవ చౌదరి, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు రామచంద్ర, నరసానాయుడు, లావణ్య, మురళీమోహన్, ఫణీంద్ర, పాల్గొన్నారు. అక్రమ మద్యం అమ్మకాలను చేస్తున్నారని తెలిస్తే టోల్ ఫ్రీ 14405, 9440902540 నంబర్లకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

కువైట్ తెలుగు కళా సమితి నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తెలుగు భాష, సాంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి ఉన్న తెలుగు కళా సమితి కువైట్ తన 2025-2026 సంవత్సరానికి కొత్త కార్యనిర్వాహక కమిటీని ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తూ, భారత రాయబార కార్యాలయంలో నమోదైన ఈ సంస్థ 1988 నుంచి సాంస్కృతిక వేదికగా సేవలందిస్తోంది. నూతనంగా ఎన్నుకోబడిన కోర్ కమిటీ సభ్యులు: హేమ్ చంద్ బసవ, అధ్యక్షుడు, బి సి శేఖర్ రాజు, ఉపాధ్యక్షుడు, కడలి ఎన్.వి.కె. ప్రసాద్ (నాని), ప్రధాన కార్యదర్శి, ఆచంట ఎస్.బి. కృష్ణ ప్రియ, సహాయ కార్యదర్శి, సరికా సత్య శ్రీధర్, కోశాధికారి, అలాగే వివిధ ప్రాంతాలను ప్రతినిధ్యం వహిస్తూ ఏరియా ఎగ్జిక్యూటివ్‌లుగా ఎన్నికైనవారు: నాయుడు విజయ లక్ష్మి (అబుహాలిఫా), నానబాల ప్రణీత్ (అబుహాలిఫా), గుంటూరి సునీల్ కుమార్ (సల్మియా), గట్ల ప్రియదర్శన్ రెడ్డి (మంగాఫ్/ఫహాహీల్/అహ్మది), తడికమల్ల సాయి అనూహ్య (ఫర్వానియా/రిగ్గే/నగరం), బత్తల వినోద్ కుమార్ (అబ్బాసియా), నాగిరెడ్డి నాగమునిరెడ్డి (హవల్లీ), ఈ సందర్భంగా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన హేమ్ చంద్ బసవ మాట్లాడుతూ, గత నాలుగు దశాబ్దాలుగా సమితి అభివృద్ధికి కృషిచేసిన పూర్వ కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. "తెలుగు భాష, సాంప్రదాయాల రక్షణకు అంకితంగా పనిచేయడంతో పాటు, యువత భాగస్వామ్యాన్ని పెంపొందించడమే మా కమిటీ ప్రధాన ధ్యేయం" అని అన్నారు. హేమ్ చంద్ బసవ స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం కాగా, ప్రస్తుతం తిరుపతిలో స్థిరపడి ఉన్నారు. గత 20 ఏళ్లుగా కువైట్‌లో ఉద్యోగవిషయాల్లో పనిచేస్తున్నారు.

వైభవంగా శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవం

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవాన్ని శ్రీవారి మెట్టు సమీపంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఆలయం నుంచి ఉత్సవమూర్తుల ఊరేగింపు శ్రీవారిమెట్టు సమీపంలోని పార్వేట మండపానికి చేరుకుంది. అక్కడ క్షేమతలిగ నివేదన చేసి పార్వేట ఉత్సవం నిర్వహించారు.

శ్రీ కిరాత వారాహి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం

ప్రజాశక్తి - రామచంద్రపురం :మండలంలోని రాయల చెరువు కట్ట సమీపంలో వెలసియున్న శ్రీ శక్తి పీఠం నందు శ్రీ వారాహీ దేవి నవరాత్రుల ఉత్సవాలలో గురువారం శ్రీ కిరాత వారాహి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ వారాహి దేవి నవరాత్రి బ్రహ్మోత్సవాలు కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి, శ్రీ శక్తి పీఠాదీశ్వరి మాతాజీ శ్రీ రమ్యానందభారతీ స్వామిలు ఆధ్వర్యంలో అంగరంగ వైభవముగా జరుగుతున్నాయి. ఉదయం 10 గంటలకు రాష్ట్ర గ్రీన్, బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవులు అమ్మవారి సేవలో తరించారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - రేణిగుంట: నేటి నుంచీ జిల్లావ్యాప్తంగా ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని జిల్లా నేతలు ప్రారంభించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గం, రేణిగుంట మండలం, వేణుగోపాలపురంలో తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, తెదేపా నాయకులు ఇంటింటికీ ప్రచారం మొదలు పెట్టారు. యేడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా తదితర తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మునిరత్నం ప్రసాద్ మృతికి నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలో గోవింద పాల్యంకు చెందిన టీడీపీ నాయకుడు మునిరత్నం ప్రసాద్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆయన మృత దేహానికి నివాళులు అర్పించారు. ఆయన వెంట రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, రాష్ట్ర యువత మీడియా కోఆర్డినేటర్ డి జి ధనపాల్, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విష జ్వరాల అదుపుకు ఉచిత వైద్య శిబిరం

విష జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): గురువారం మండలంలోని రాయలపురం పంచాయతీలో విష జ్వరాల అదుపు కోసం చంద్రగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కుసుమ, డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు గ్రామాలలో పర్యటించి అంటు వ్యాధులు నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు రోజులకు ముందు చంద్రగిరి పట్టణం సమీపంలోని రాయలపురంలో విష జ్వరంతో జాష్మిన్ మృతికి స్పందిస్తూ ఇందిరమ్మ కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఇంటింట ఫీవర్ సర్వే చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం" ఫ్రై డే డ్రై డే "గా పాటించాలన్నారు. వ్యాధికారకాలైన దోమల నుంచి రక్షణ పొందటానికి దోమతెరలు వాడాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వేడి ఆహారం తీసుకోవాలని ప్రజలకు ఆరోగ్య విద్య బోధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సెల్వియా,జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూపకుమార్, శివయ్య, ఎం పి హెచ్ ఈ ఓ ఈశ్వరయ్య, రామాంజనేయ రెడ్డి, యస్. వెంకటమ్మ ,వాసుదేవ, శ్యామల, గంగయ్య (హెచ్‌ఏ మగ),ఎం ఎల్ హెచ్ పి ఎస్,ఏ ఎన్ ఎంలు,ఆశాలు పాల్గొన్నారు.

పలగాటి భాస్కర్ రెడ్డికి జనార్దన్ రెడ్డి శుభాకాంక్షలు



ప్రజాశక్తి-కోట : కోట మండలం కొక్కుపాడులో నూతనంగా ఎన్నికైన కోట మండల టిడిపి అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డిని ప్రముఖ పారిశ్రామికవేత్త టిడిపి నాయకులు దువ్వూరు జనార్దన్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పలగాటి భాస్కర్ రెడ్డికి కోట మండల అధ్యక్ష పదవి రావడం చాలా ఆనందంగా ఉందని జనార్దన్ రెడ్డి తెలిపారు. దువ్వూరు జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో పలగాటి జితేంద్ర రెడ్డి, యరటపల్లి వసంత్ కుమార్ రెడ్డి, యరటపల్లి శ్యాంసుందర్ రెడ్డి ,మర్రి పోలయ్య ,కార్తీక్, మస్తాన్, మీజూరు చంద్ర ప్రకాష్, మధు, గురు ప్రసాద్, సుబ్బు, బాబు, శ్రీను, కిరణ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేరువేరు కుటుంబాలకు చెందిన ఇద్దరు మహిళలు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెళ్ళకూరు:పెళ్లకూరు మండలంలో వేరువేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. చావాలి చంబడి పాలెం గ్రామానికి చెందిన గిరిజన కాలనీలో నివసిస్తున్న ప్రసాద్ కుమార్తె సుభాషిని (16) అంగవైకల్యం, ఆరోగ్యం బాగా లేకపోవడంతో తండ్రికి వచ్చే పింఛన్‌తో జీవనం సాగిస్తోంది. ఇతర సహాయ, సహకారాలు లేకపోవడంతో కుటుంబం గడవడం కష్టమై మనస్థాపంతో జూన్ 28వ తారీకు గుళికలు తినగా, ఆమెను వెంటనే నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె గురువారం మృతి చెందింది. మండలంలోని పునబాక పిసిటి కండ్రిగ కాలనీకి చెందిన అమాస దుర్గ (22) తన భర్తకి కొద్ది నెలల క్రితం యాక్సిడెంట్ అయి వైద్యం పొందుతున్న క్రమంలో టీబీ, క్యాన్సర్ అటాక్ అయిందని వైద్యులు చెప్పడంతో మనస్థాపం చెంది గురువారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. ఈ ఇరువురి మరణాలు సకాలంలో వైద్యం చేయించుకోలేక కుటుంబాన్ని పోషించలేని పరిస్థితుల్లో జరిగాయని ఇలాంటి పరిస్థితులు ఎవరికీ రాకూడదని గ్రామప్రజలు వాపోతున్నారు.

తిరుమల ఘాట్‌లో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తిరుమల డౌన్ ఘాట్ రోడ్డులోని ఏడో మైలు సమీపంలో గురువారం రాత్రి ఏనుగుల గుంపు సంచారం చేస్తూ కనబడింది. అటవీ సిబ్బంది అప్రమత్తమై ఏనుగులును అడవి లోకి దారిమళ్లించారు. ఏనుగుల సంచారంతో దిగువ ఘాట్ రోడులో ట్రాఫిక్ స్తంభించింది. విజిలెన్స్ సిబ్బంది ట్రిఫిక్ క్లియర్ చేశారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవ పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య, గూడూరు శాఖ వారి ఆధ్వర్యంలో ముంగమూరు సీతమ్మ బ్రాహ్మణ భవనంలో 6వ తేదీ ఉదయం 9 గంటలకు సమాఖ్య అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ దంపతులు, నెల్లూరు వాస్తవ్యులు పండితోపన్యాసకులు, విశ్రాంత తెలుగు పండితులు బ్రహ్మశ్రీ ఆలూరు శిరోమణిశర్మ దంపతుల ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.